విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ఓటర్ల తొలగింపులో నిశిత పరిశీలన అవసరం

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: ఓట్ల తొలగింపులో పారదర్శకతతో కూడిన పరిశీలన అవసరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తొలగించిన ఓట్లు పున:పరిశీలనపై ప్రత్యేక అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో తొలగించిన ప్రతి ఓటుపై పున:పరిశీలన చేయాలని స్పష్టం చేశారు. 2022 జనవరి 6 నుంచి ఇప్పటి వరకూ తొలగించిన ప్రతి ఓటునూ క్షేత్రస్థాయికి వెళ్లి పున:పరిశీలన చేయాలని బి.ఎల్.ఓలకు ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. బి.ఎల్.ఓలు తనిఖీ చేసిన ఫైల్స్‌ను పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రత్యేక అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియను ఆగస్టు 30 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి తొలగింపుకు స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్ పాటించారా లేదా అనేది తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ఓట్లు తొలగింపు పరిశీలన అధికారులు జిల్లా అటవీ శాఖ అధికారి ఆశా కిరణ్, టూరిజం శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ వి.స్వామి నాయుడు, జిల్లా పరిశ్రమ శాఖ అధికారి ఉయ్యాల ఆది శేషు, జిల్లా సర్వే అధికారి జాషువా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరు

- జిల్లాలో 5,024 మంది లబ్దిదారులకు రూ. 5.86 కోట్లు జమ
- జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరు కింద అర్హులై ఉండి ఏ కారణంచేతనైనా లబ్ది అందని 5,024 మంది లబ్దిదారుల ఖాతాలకు రూ. 5.86 కోట్లు జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరు కింద 2,62,169 మంది అర్హులకు రూ. 216.34 కోట్లను బటన్ నొక్కి నేరుగా లబ్దిదారుల ఖాతాలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ జమచేశారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుంచి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్నవెంకటేష్, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, సాంఘీక సంక్షేమశాఖ జేడి జయప్రకాష్, బిసి కార్పోరేషన్ ఇడి ఎన్. పుష్పలత, జీఎస్ డబ్ల్యూఎస్ నోడల్ అధికారి రమణ, పలువురు విద్యార్థినీ విద్యార్థులు, లబ్దిదారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం లబ్దిదారులకు మెగా నమూనా చెక్కును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ లబ్దిదారులకు అంద జేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రస్తుత ద్వైవార్షిక నగదు మంజూరు కింద జిల్లాలో 5 వేల 024 మంది లబ్దిదారులను గుర్తించి రూ.5 కోట్ల 86 లక్షల 17 వేల 301లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

నవరత్నాలు ద్వై వార్షిక నగదు మంజూరు

- జిల్లాలో 4318 మందికి రూ.5.33 కోట్ల లబ్ది
- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: నవరత్నాలు-ద్వై వార్షిక నగదు మంజూరు కార్యక్రమం ద్వారా జిల్లాలో 4,318 మంది లబ్దిదారు లకు రూ.5.33 కోట్ల మేర లబ్ది జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. వివిధ సంక్షేమ పథకాలకు అర్హత ఉండి నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోలేకపోవడం, బ్యాంకు ఖాతా వివరాలు సరిగా లేకపోవడం తదితర కారణాల వల్ల మిగిలిపోయిన వారికి నవరత్నాలు-ద్వై వార్షిక నగదు మంజూరు కార్యక్రమం ద్వారా లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, గ్రామ, వార్డు సచివాలయాలు, గ్రామీణాభివృద్ధి, విద్య, బీసీ సంక్షేమం, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారులు, వివిధ ప్రాంతాల లబ్ధిదారులతో కలిసి వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పథకాల లబ్ధి మొత్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచి వాలయాల అధికారి కేసిహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, బీసీ సంక్షేమ శాఖ అధికారి గణపతి రావు, సాంఘిక సంక్షేమ అధికారి శోభారాణి, వివిధ శాఖల అధికారులు, పథకాల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు అండగా వీవర్స్ ఫెడరేషన్

విశాలాంధ్ర-తణుకు: జాతీయ స్థాయిలో చేనేతలకు అండగా ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ఉంటుందని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ సంతం రమణ మహేష్ అన్నారు. గురువారం రాష్ట్ర వీవర్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర బీసీ నాయకురాలు, సంఘ సంస్కర్త వావిలాల సరళాదేవి నివాసంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. వావిలాల సరళాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ సంతం రమణ మహేష్ పాల్గొని మాట్లాడారు. చేనేతలు అందరూ కలిసికట్టుగా ఉండా లన్నదే ధ్యేయంగా, వెనుకబడిన చేనేత కుటుంబాలను రాజకీయంగా, సామాజికంగా అందరికి అండగా ఉండే విధంగా కృషి చేస్తున్నామన్నారు. వావిలాల సరళాదేవి మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ ఆదివారం గాజువాకలో టి ఎన్ ఆర్ కళ్యాణమండపంలో జరిగే చేనేతల ఆత్మీయ సమావేశానికి అధిక సంఖ్యలో చేనేత కుటుంబాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలోబీసీ సంఘాల నాయకులు, చేనేత సంఘాల నాయకులు విశ్వనాథం, దుర్గా రమేష్, కరేళ్ల శ్రీనివాస్, పెరవలి రామకృష్ణ, సత్తిబాబు, శ్రీనివాస్, కృష్ణవేణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారత్ మాతాకీ జై... జయహో ఇస్రో

విశాలాంధ్ర-తణుకు: ప్రపంచ దేశాల్లో టెక్నాలజీలో ముందున్న దేశాలకు కూడా సవాలుగా మారిన చంద్రయాన్ దక్షిణ ధ్రువంపై ఇస్రో శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగం విజయం చేకూర్చడంతో స్థానిక రూట్స్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు విద్యార్థినీ విద్యార్థులుగురువారం పట్టణంలో భారత్ మాతాకీ జై.. జయహెూ ఇస్రో అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్స్ త్రిపాఠి, విద్యాకాంత్‌లు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో చంద్రుని దక్షిణ ధ్రువం పై నేటి వరకు మిషన్ విజయవంతం కాలేదని కానీ భారతీయ శాస్త్రవేత్తలు ఇస్రో సంస్థ ప్రయోగించిన చంద్రయాన్ 3 విజయవంతంగా ల్యాండర్ జాబిల్లిపై విజయవంతంగా కాలిమోపి భారత వైజ్ఞానిక సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిందని పేర్కొన్నారు. యావత్ ప్రపంచమంతా నేడు భారతదేశం వైపు చూసే విధంగా విజయానందించిన ఇస్రో శాస్త్రవేత్తలు మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

సీపీఐ బస్సు యాత్రకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-నూజివీడు: దేశాన్ని కాపాడండి-రాష్ట్రాన్ని రక్షించండి అనే నినాదంతో రాష్ట్రంలో కొనసాగుతున్న సీపీఐ బస్సుయాత్ర గురువారం నూజివీడులో కొనసాగింది. తొలుత పోతురెడ్డిపల్లి లోని అమరవీరుల స్థూపం వద్ద రామకృష్ణ పూలమాల వేసి అమరవీరులకు నివాళులర్పించి బస్సుయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్సుయాత్రకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం నూజివీడు అమర్ భవనంలో సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు చలసాని వెంకటరామారావు అధ్యక్షతన భూ సదస్సును నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదవాడి చేతిలో భూమి లేకుండా చేసేందుకు కుట్రలు సాగుతున్నాయని అన్నారు. ఆందోళన, ఉద్యమాల ద్వారా సాధించుకున్న వాటిని రక్షించుకునేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం పేదల పక్షాన నిలబడటానికి ఎర్రజెండా ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ తరాలుగా అటవీ బంజరులను సాగు చేసుకుంటున్న పేదల సాగు హక్కులు సాధించుకోవడం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్న సాగు భూములకు రక్షణ లేకుండా పోతున్నదన్నారు. ప్రభుత్వాల విధానాల వల్ల పేదవాడు పేదవాడి గానే మిగిలిపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్లే భూ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. పేదవాడికి సాగుహక్కు కల్పించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ తదితరులు ప్రసంగించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్ 2 పూర్తి చేయాలని కోరుతూ తీర్మానాన్ని సిపిఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు ప్రవేశపెట్టారు. సిపిఐ నూజివీడు ఏరియా కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. ఈ భూ సదస్సులో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, లెనిన్ బాబు, చంద్రానాయక్, నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చర్చిలపై మైకులు తీయకపోతే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - నిడమర్రు: ప్రార్థన మందిరాలు చర్చిలపై మైకులు వలన ప్రజలకు ఇబ్బందికి గురి చేస్తే వారిపై చర్యలు తప్పవని ఏలూరు డి ఎల్ పి ఓ చంద్రశేఖర రావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన నిడమర్రు ఇందిరమ్మ కాలనీలో క్రైస్తవ సంఘాలు నిర్వాహితులు కొనసాగిస్తున్న చర్చి పైన పెట్టిన మైకు గొట్టాల నుండి వస్తున్న అధిక శబ్దాలు వలన విసికిపోయిన కాలనీ వాసులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయగా ఈరోజు డి.ఎల్. పీవో వచ్చి విచారణ జరిపిన తరువాత గ్రామ పంచాయతీ ఎలక్ట్రీషియన్ తో మైకులు తీయించమని లేని పక్షంలో పోలీసు వారితో కేసులు నమోదు చేయించమని నిడమర్రు గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింహ స్వామికి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సంకెళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

విశాలాంధ్ర-ఏలూరు: ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉప రవాణా కమిషనరు ఎస్.శాంత కుమారి విజ్ఞప్తి చేశారు. గురువారం ఏలూరులోని స్థానిక అగ్నిమాపక కార్యాలయం వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ ఇటీవల జరిగిన జిల్లా రహదారి భద్రతా సమావేశంలో రహదారి భద్రత చర్యలలో భాగంగా హెల్మెట్ ధారణ పై విస్తృత అవగాహన కలిగిస్తున్నామన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తలకు హెల్మెట్ ధరించకపోవడం వలన రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయాలు కావడంతో మృతి చెందుతున్నారన్నారు. ఏలూరు జిల్లాలో రహదారి ప్రమాదాల శాతం తగ్గించేందుకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రహదారి ప్రమాదాలలో హెల్మెట్ ధారణ వల్ల మరణాలు తగ్గించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా అధికారి .కె. శ్రీవారి మోటారు వాహనాల తనిఖీ అధికారులు కె. విజయ రాజు, జి.ప్రసాదరావు, కె.వి.ఎస్.ప్రసాదు, వై.సురేష్ బాబు, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రయాన్ - 3 విజయవంతంపై శుభాకాంక్షలు

విశాలాంధ్ర - కలిదిండి: చంద్రయాన్ - 3 విజయవంతం పై విద్యార్థులు మానవహారంగా ఏర్పడి శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం కలిదిండి సెంటర్లో కలిదిండి ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు టపాసులు కాల్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సాన. వెంకట రామారావు (రాము) మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో భారతదేశం అగ్రగామిగా విస్తరిస్తుందని అన్నారు. చంద్రయాన్ - 3 విజయంపై ఇస్రో కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పడమటి పాలెం సర్పంచి సాన. మీనా సరస్వతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జయహెూ భారత్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : చంద్రయాన్ జాబిల్లిని చేరిన సందర్భంగా కొయ్యలగూడెం పట్టణంలో సమైక్య యూత్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ఉన్న వినాయకుని ఆలయం వద్ద రాష్ట్ర మహిళా హక్కుల కమిషన్ చైర్మన్ గంగిరెడ్ల మేఘాలదేవి చేతుల మీదుగా కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య యూత్ అధ్యక్షుడు గంగిరెడ్ల సతీష్ కుమార్, ముప్పిడి చినబాబు, చెప్పుల మధుబాబు, నక్క బాబి, మాదేపల్లి శ్రీను, మేడిన కన్నయ్య, ఏపూరి సతీష్, కొడపాక పాండు, మందపాటి రామకృష్ణ, యర్రం శెట్టి రాము, ఆటో యూనియన్స్ డ్రైవర్లు, జట్టు కార్మికులు, రిక్షా డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇస్రోకు అభినందనలు

విశాలాంధ్ర-తణుకు: భారత ఇస్రో శాస్త్రవేత్తలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన చంద్రయాన్ 3 విక్రమ్ ల్యాండర్ జాబిల్లి దక్షిణ ధ్రువం పై కాలు మోపి 140 కోట్ల భారతీయుల కలలను నిజం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు రాష్ట్ర వీవర్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర బీసీ నాయకురాలు, సంఘసంస్కర్త వావిలాల సరళాదేవి జాతీయ పతాకంతో అభివాదం తెలిపారు. గురువారం స్థానిక ఆమె నివాసం వద్ద విజయోత్సవ సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేసిన చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడం యావత్ భారత ప్రజలు ఆనందోత్సాహాలతో ఉన్నారన్నారు. దక్షిణ ధ్రువం పై మొట్టమొదటిగా దిగిన చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడం భారతీయుల విజయం అన్నారు. అనంతరం కేక్ ను కట్ చేసి, స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ఆమె వెంట ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల బీసీ నాయకులు, చేనేత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, సరళాదేవి, అభిమానులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఆర్. ఫణీంద్ర బాబు తెలిపారు. మండల వైద్యాధికారిణి జె. కల్పనారాణి ఆదేశాల మేరకు టి నరసాపురం పంచాయతీలోని రుద్రకోటరాజుగూడెంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే - ఫ్రైడే పాటించాలని, ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని తెలిపారు. నీరు నిల్వ ఉండే ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీళ్ల తొట్టెలు, ప్లాస్టిక్ డ్రమ్ములతో పాటు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటలక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర- ఉండి: ఉండి మండలం వాంద్రం గ్రామంలో దళితుల పైన, ప్రార్థన మందిరం పైన దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని వెంటనే వారిని అరెస్టు చేయాలని మాల చైతన్య మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు తోకల రాజేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయంలో దళితులపై అకస్మాత్తుగా వచ్చి విచక్షణారహితంగా దాడి చేసి వారిని గాయపరచడమే కాకుండా ప్రార్థన మందిరం అద్దాలను పగలగొట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. దేశంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను ఇంకా అరెస్టు చేయకుండా కొంతమంది నాయకులు రాజీ ప్రయత్నాలు చేయాలని చూడడం ఎంతవరకు సమంజసమో వారే చెప్పాలన్నారు.

డ్రాపవుట్స్ గుర్తింపు

విశాలాంధ్ర-లింగపాలెం : లింగపాలెం మండలంలో డ్రాపవుట్స్‌ను గుర్తించే కార్యక్రమంలో అధికారులు నిమగ్నమయ్యారు. దీనిపై మండల విద్యాశాఖ అధికారి రామారావు, తహశీల్దార్ ఆర్వీ మురళీకృష్ణ, ఎంపిడిఓ ఆశీర్వాదం, మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మండలంలో 949 మంది డ్రాపవుట్స్ విద్యార్థులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం ఉందని వీరు పేర్కొన్నారు. వీరిలో వివాహాలు చేసుకున్న వారు, వలస వెళ్లినవారు, చదువు మానేసి పనులకు వెళ్లేవారిని, చనిపోయిన వారిని గుర్తిస్తున్నామని దీనికోసం వెల్ఫేర్ అసిస్టెంట్లు వాలంటీర్లు, సిఆర్ఎమ్‌టిలు, గ్రామ రెవెన్యూ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఆర్థిక స్థోమత లేక చదువు నిలిపేసిన వారికి ఆసరా కల్పించటంతోపాటు వారి విద్యార్హతను బట్టి వృత్తి విద్యా కోర్సులకు శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధికి ప్రోత్సాహం అందించే చర్యలు తీసుకుంటున్నామని వీరు పేర్కొన్నారు.

శ్మశాన భూమి ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: స్మశాన భూమి ఆక్రమణ దారులు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని జంగారెడ్డిగూడెం డిపిఓ శ్రీనివాస్ విశ్వనాథన్ తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో స్మశాన భూమి ఆక్రమణలు తొలగించాలని స్పందనలో ఫిర్యాదుతో గురువారం స్మశాన భూమిని సందర్శించి ఆక్రమణ దారులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణదారులకు జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయిస్తామని ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఖాళీ చేసి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ ఎండి రజావుల్లా, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కృష్ణ, వీఆర్వో ఎ సుబ్బారావు, కార్యదర్శి శివ ప్రసాద్ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఉంగుటూరు : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ ఒకటవ తేదీన రక్తదాన, మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్స మట్ల ధర్మరాజు తెలిపారు. గోపినాధపట్నం గ్రామం లో శ్రీ లక్ష్మీ నారాయణ అన్నదాన సత్రం వద్ద మెగా ఉచిత వైద్య శిబిరం జరుగు తుందన్నారు. శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు, ఈసీజీ, డెంటల్, ముక్కు, చెవి, గొంతు, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, స్త్రీల వైద్య నిపుణులు, చర్మ వ్యాధుల నిపుణులు, కంటి ఉచిత పరీక్షలు చేస్తారు. ఉంగుటూరు నియోజకవర్గం జనసేన నాయకులు, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత భూముల ప్రక్రియపై సమావేశం

విశాలాంధ్ర-ఏలూరు: నిషేధిత భూముల జాబితా నుండి తొలగించేందుకు అవసరమైన ప్రతిపాదనలకు సంబంధించి విధి విధానాలు తెలియపరిచేందుకు గురువారం స్థానిక గిరిజన భవన్ లో ఏలూరు ఆర్డిఓ కె. పెంచల కిషోర్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏలూరు డివిజన్‌లోని 11 మండలాలకు చెందిన తహశీల్దార్లు, విఆర్‌ఓలు హాజరయ్యారు. 2003 ముందు అసైన్డ్ ల్యాండ్ నిషేధిత భూములు జాబితానుండి తొలగించే ప్రక్రియకు సంబంధించి ప్రతిపాధనలను ప్రూట్నికి సంబంధించి విధి విధానాలను ఆయన వివరించారు. సంబంధిత భూముల రికార్డులను పరిశీలించడంతోపాటు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి భూముల సర్వే నెంబరు, విస్తీర్ణం తెలియజేయాలన్నారు.

రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

విశాలాంధ్ర- భీమవరం: రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుండి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం, రీసర్వే ప్రక్రియ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్లతో సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కె.జాషువా తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం కింద రీసర్వే ప్రక్రియను వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మొదటి దశలో 16 గ్రామాలు రీసర్వే ప్రక్రియ పూర్తి కావడం జరగగా, ఆయా గ్రామాల్లో పాసు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని, స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి కావడం జరిగిందన్నారు. రెండవ దశలో 54 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను చేపట్టడం జరిగిందని, ఆయా గ్రామాల్లో రీసర్వే పనులు వేగంగా చేపట్టాలన్నారు. ఈ సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. నిర్దేశిత గడువులోగా రీసర్వే కింద అన్ని రకాల ప్రక్రియలను పూర్తి చేయాలని, ఈ విషయమై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ లక్ష్యం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పని చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మారుతీ నగర్ లో రూ.85 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన యుపిహెచ్‌సివైఎస్ ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్ర భవ నాన్ని గురువారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశ పెట్టినట్టు తెలిపారు. వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునీకరించటంతో పాటుగా పట్టణాల్లో, గ్రామాల్లో వైయస్సార్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మారుతి నగర్ లో యు పి హెచ్ సి వై ఎస్ ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల 8 సచివాలయాలకు సంబంధించిన 27,619 మందికి వైద్య సేవలు మరింత చేరువయ్యాయన్నారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి ఈ 8 సచివాలయాలకు సంబంధించిన ప్రజలు ఇకనుండి వెళ్లాల్సిన అవసరం లేదని, దగ్గర్లో ఉన్న ఈ ఆరోగ్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల, డిపిఎమ్‌ఓ డాక్టర్ సువర్ణ రాజు, డాక్టర్ లీలా లక్ష్మి, వాసర్ల ముత్యాలరావు, రాజేష్, ప్రవీణ్, కొత్తల కృష్ణ బాబు, కముజు చిన్న, పబ్లిక్ హెల్త్ డిఈ విజయ్, ఏఈలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పి.హెచ్.సి డాక్టర్ పి. కిరణ్మయి అన్నారు. గురువారం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాల యం 2 లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ క్యాంపులో కిరణ్మయి ఆధ్వర్యంలో బిపి, షుగర్ ఉన్న వారిని పరీక్షించి అందరికీ ఉచితంగా మందులు ఇచ్చారు. గర్భిణీ స్త్రీలను, బాలింతలను కిషోర్ బాలికలను పరీక్షించి మందులు ఇచ్చినట్లు తెలిపారు. సాధారణ కేసులు 20 మందిని, మొత్తం ఒపి, 265 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ జె.విల్సన్ బాబు, ఎం హెచ్ పి డి. ఆశాజ్యోతి, ఏ ఎన్.ఎం ఆర్. రమాదేవి, హెల్త్ అసిస్టెంట్లు ఎంఎస్ యోహాన్, ఎ. కృష్ణ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శివకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించిన ధర్మరాజు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం వాకపల్లి గ్రామానికి చెందిన సత్తినీడి రామపండు కుమారుడు జనసేన పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు సత్తినీడి శివ కృష్ణ ఆకస్మికంగా మృతి చెందారు. గురువారం వారి కుటుంబ సభ్యులను ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు పరామర్శించారు. ఆయనతో పాటు జనసేన మండల నాయకులు తోట శ్రీను, తానేటీ జోగేశ్వరరావు, గ్రామ జనసైనికులు ఆదిమూలం స్వామి, కొమ్మన సత్యనారాయణ, మద్దాల రాఘవ, మద్దాల లక్ష్మీనారాయణ, తడాల లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దవలసిన బాధ్యత ఉపాధ్యాయులదే

విశాలాంధ్ర- ఉంగుటూరు: విద్యార్థులను బంగారు బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మానవతా సంస్థ అధ్వర్యంలో పెద్దిరెడ్డి వేణుగోపాల ప్రసాదరావు, శేషవేణి చారిటబుల్ ట్రస్ట్ సహకారం తో 155 మంది విద్యార్థులకు ఉచిత బస్ పాస్ లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి జిల్లా ట్రాన్స్కో విజిలెన్స్ ఆఫీసర్ వి. రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడిచదివి ఉన్నత శిఖరాలకు వెళ్లాలని కోరారు. దాత ముత్తంగి వేణుగోపాల్, మానవతా రీజనల్ చైర్మన్ పుప్పాల గోపి, మానవతా ఉంగుటూరు మండల శాఖ అధ్యక్షులు గంజి రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ సర్వేశ్వర రావు, తాడేపల్లిగూడెం ఆర్టిసి పిఆర్‌ఓ విజయ్ కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శానం లక్ష్మణరావు, కొనే సత్యనారాయణ, కొల్లబతుల నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఐ నాగరాజు జ్యోతి దంపతుల అన్నదానం

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణపురం షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం దాత సీఐ వెంకట నాగరాజు, జ్యోతి దంపతులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా షిరిడి సాయిబాబా వ్యవస్థాపక అధ్యక్షులు అక్కిన భాస్కరరావు దాత నాగరాజు జ్యోతి దంపతులను సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షులు బండారు నాగరాజు, గ్రామ ఉప సర్పంచ్ అడపా శ్రీనివాస్, వార్డు సభ్యులు నేదూరి గంగాధర్రావు, ఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత సి ఐ నాగరాజు దంపతులను ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. షిరిడి సాయిబాబాను దర్శించుకున్నారు.

టీడీపీ మేనిఫెస్టోతో అన్ని రంగాల అభివృద్ధి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో పథకాలు ప్రతి ఒక్కరికి ఉపయోగపడతాయని , రైతులకు ప్రతి ఏటా రూ. 20 వేలు నేరుగా వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని మేనిఫెస్టోలో రైతులకు వారి ఖాతాలో నగదు జమ చేసే ప్రక్రియ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టడం ఆనందదాయక మని రాజవరం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ వాడపల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. గురువారం రాజవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు సుధగాని సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పరిధిలో భవిష్యత్తు గ్యారెంటీ, యువశక్తి పథకాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో రాపోలు పతి రాజు, కాకర్లమూడి రాజేశ్వరరావు, గర్శికూటి శ్రీను, ఎర్రావుల ఏడుకొండలు, గరికపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డి.ఎస్.పి ధనుంజయుడుకు అభినందనలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ఇటీవల సెంట్రల్ హోంశాఖ ఎక్సలెన్సీ అవార్డు పొందిన జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడును పట్టణంలోని పలువురు మహిళా సంఘాల ఆధ్వర్యంలో గురు వారం అభినందనలు తెలియ జేశారు. భవిష్యత్ లో మరిన్ని ప్రతిభా పురస్కారాలు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సంఘ నాయకురాలు దాట్ల అన్నపూర్ణ దేవి,పట్టణ వైసీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు నాగదేవి, మానవత జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, మెప్మా ఆర్పీ నాగలక్ష్మి,హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : యావత్ భారతదేశం అంతా గర్వించదగ్గ మహా గొప్ప విజయాన్ని భారతదేశానికి అందించిన ఇస్రో శాస్త్రవేత్తలకు ధన్యవాదాలు తెలియజేస్తూ స్థానిక సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ హై స్కూల్ వద్ద విద్యార్థిని విద్యార్థులు రాకెట్ నమూనాను తయారు చేసి ఇస్రో శాస్త్రవేత్తల యొక్క గొప్ప కీర్తిని చాటిచెప్పారు. చంద్రయన్ - 3 విజయవంతం కావడంతో పాఠశాలలోని విద్యార్థులంతా ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఐ. రాజ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని దేశం గర్వించగలిగే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆనంద్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన పారేపల్లి రామారావు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఏలూరు జిల్లాలో ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఆయనను మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికిన పోలవరం మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు. ఈయన వెంట మండల పార్టీ అధ్యక్షులు పారేపల్లి నరేష్, సీనియర్ నాయ కులు పరిమి రాంబాబు, తెలుగు యువత నాయకులు ఉద్దండం లెజెండ్, టేక్కెం సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు వ్యతిరేకంగా నిరసనలు

విశాలాంధ్ర - కలిదిండి: అధిక ధరలకు వ్యతిరేకంగా ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యవర్గ సభ్యులు డి.ఎన్ వి డి ప్రసాద్ అన్నారు. గురువారం యుటిఎఫ్ కార్యాలయం నందు సిపిఎం పార్టీ నియోజకవర్గ విస్తృత సాయి స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగం, విద్యుత్ చార్జీలు అధిక ధరలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల వద్ద మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. గురువాయిపాలెం - పెద్దలంక ఆర్ అండ్ బి రహదారి అత్యంత ప్రమాదకరంగా ఉందని పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లు బాగు చేయకుండా ప్రభుత్వం, అధికారులు అలసత్వం వహిస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో కలిదిండి, కైకలూరు మండల పార్టీ కార్యదర్శి శేషపు. మహంకాలరావు, కురెళ్ళ. లాజర్, వీరవల్లి. భాస్కరరావు, చిన్నం. మాధవ, ఏ. వెంకటేశ్వరరావు, పి. జ్ఞానేషు, పి. సత్యనారాయణ, జె. మహేష్, డి. వెంకట సత్యనారాయణ, కే. శ్రీనివాస్, పి. రాజేష్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో చెత్త బుట్టల పంపిణీకి సిద్ధం

విశాలాంధ్ర-పోడూరు : జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకం లో భాగంగా పోడూరు మండలంలోని గ్రామ పంచాయతీలలో పంపిణీకి చెత్తబుట్టలు సిద్ధమయ్యాయి. జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకంలో భాగంగా గ్రామాలలో ప్రతి ఇంటికి తడి చెత్త వేయడానికి ఒక చెత్త బుట్ట, పొడి చెత్త వేయడానికి ఒక చెత్త బుట్ట పంపిణీ చేయనున్నారు. మండల వ్యాప్తంగా గ్రామాల వారిగా మొత్తం 16వేల చెత్త బుట్టలు అవసరం కాగా ఇప్పటివరకు 10 వేల చెత్తబుట్టలు ప్రభుత్వం నుంచి పంపిణీ అయినట్లు ఎంపీడీవో డి సుహాసిని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నుండి చెత్త బుట్టలను గురువారం గ్రామ పంచాయతీ లకు సరఫరా చేస్తున్నారు. ప్రజలందరూ పంచాయతీ నుండి ఇచ్చిన చెత్తబుట్టలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటిసి గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, ఎంపీడీవో డి సుహాసిని, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బుజ్జేశ్వరరావు తెలిపారు.

నియోజకవర్గంలో వైసీపీ అభివృద్ధికి అందరూ సహకరించాలి

విశాలాంధ్ర-పోడూరు: పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత అభివృద్ధి చేసేందుకు వైసిపి నాయకులు కార్యకర్తలు అందరూ సహకరించాలని పాలకొల్లు నియోజకవర్గం వైసీపీ ఇన్ చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) కోరారు. నియోజకవర్గ వైసిపి ఇన్ చార్జిగా నియమితులైన తరువాత మొదటిసారిగా పోడూరు మండలంలోని పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని పెనుమదం రావిపాడు వద్దిపర్రు గ్రామాలను గురువారం ఆయన సందర్శించి స్థానిక వైసీపీ నాయకులను కార్యకర్తలను కలుసుకున్నారు. ఆయా గ్రామాలలోని నాయకులను కార్యకర్తలను జడ్పిటిసి గుంటూరి పెద్దిరాజు ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ మండల కన్వీనర్ కలిదిండి గణపతిరాజు స్థానిక నాయకులను వైసీపీ కార్యకర్తలను గోపీకి పరిచయం చేశారు. ప్రతి ఒక్కరు తమ పూర్తి సహకారాన్ని అందించాలని గోపి కోరారు. కార్యకర్తలకు స్థానిక నాయకులకు తాను అండగా ఉంటానన్నారు. నియోజకవర్గ వైసిపి నాయకులు యెడ్ల తాతాజీ కొర్రపాటి వీరాస్వామి తదితరులు గోపీ వెంట ఉన్నారు.

ఉత్పత్తి ఖర్చు తగ్గింపుతో రైతులకు ఉపయోగం

జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో రైతుల ఆదాయం పెంపొందించే దిశగా విస్తృతంగా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లను (ఎఫ్ పిఓ) ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక యంపిడిఓ కార్యాలయం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి దారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఉత్పత్తి మరియు మార్కెటింగ్ లో స్కేల్ ఆఫ్ స్కేల్ ను ఉపయోగించడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యాన్ని సాధించడంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు(ఎఫ్ పిఓలు) కీలక మన్నారు. దీర్ఘకాలికంగా ఆదాయ-ఆధారిత వ్యవసాయానికి ఎఫ్ పిఓలు భరోసానిస్తా యన్నారు. ఇది వ్యవసాయ ఉత్పత్తి ఖర్చును తగ్గించడం ద్వారా రైతులకు ఎక్కువ డబ్బు సంపాదించడానికిఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ఉద్యాన పంటలకు అధిక లాబాలు అందించేలా తోడ్పడటానికి ఉద్యాన శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ఎఫ్ పిఓ గ్రూపులకు ఏఐఎఫ్ పథకం కింద కలెక్షన్ సెంటర్, కోల్డ్ రూమ్ కింద 75 శాతం సబ్సిడీతో అమలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే పిఎఫ్ యం ఎఫ్ ఇ పథకం కింద 35 శాతం సబ్సిడీతో ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేసుకోవచ్చునని రూ. 10 లక్షలు ఒక యూనిట్ కు ఇవ్వబడుతుందని వివరించారు. రైతులకు డైరెక్ట్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కంటే ప్రోసెస్డ్ ఫుడ్స్ ద్వారా లాభదాయకమని, వారియొక్క వార్షిక ఆదాయం ఎక్కువగా పెరుగుతుందని వివరించారు. సమావేశంలో సిడిబి డిప్యూటీ డైరెక్టర్ ఎస్. కుమార్, ఎపిఎఫ్ పిఎస్ జోనల్ మేనేజరు కెజె మారుతీ, ఉద్యాన శాఖ డిప్యూటీ డెరెక్టర్ డా. ఎస్. రామ్మోహన్, నాబార్డ్ డిడిఎం నవకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జిన్నూరులో టిడిపి మహాశక్తి

విశాలాంధ్ర-పోడూరు :తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం గ్రామ గ్రామానికి భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను చేర్చాలన్న ఉద్దేశంతో పాలకొల్లు నియోజకవర్గంలో టీడీపీ నిర్వహిస్తున్న మహాశక్తి కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని జిన్నూరు లో మహాశక్తి కార్యక్రమం జరిగింది. మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి టీడీపీ మహిళలకు చేకూర్చే లబ్ధిని, తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోలో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పథకాలను మండల టీడీపీ అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు వివరించారు. పాల నాగలక్ష్మి, కర్నేన రోజారమణి, తెలుగుదేశం పార్టీ నాయకులు భూపతి రాజు సత్యనారాయణ రాజు, దాసరి రత్నరాజు, పాలవలస తులసిరావు, వల్లూరి మాధురి, బొక్క కనకదుర్గ, బాలం వరలక్ష్మి, గుబ్బల యశోద, గుబ్బల మహాలక్ష్మి, తోకలపూడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర -కైకలూరు : పరిచయం లేని అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడెం వీర వెంకటసత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. మండల లీగల్ సెల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జాగృతి హైస్కూల్లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ప్రలోభాలకు గురిచేసి బాలబాలికలను తప్పుదోవ పట్టించే సంఘటన జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా బాలికలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ చావలి శంకర్ శాస్త్రి,మహిళా ప్రతినిధి ఎండి రజీమున్నీసా,పెనల్ అడ్వకేట్ పి పవన్ కాంత్ న్యాయవాదులు వి మమత, అలేఖ్య,మహిళా పోలీస్ ఆశా, ఎం ఎల్.ఎస్.సి కోఆర్డినేటర్ దుర్గాభవాని, పారా లీగల్ వాలంటీర్స్ రాంబాబు, వేణు, స్కూల్ ప్రిన్సిపాల్ కిషోర్ బాబు, ప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరీక్షణరాజుకు డాక్టరేట్

విశాలాంధ్ర-కాళ్ళ: కోపల్లె గ్రామానికి చెందిన సంఘ సేవకుడు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నిరీక్షణ రాజుకు గోవా లోని సన్ రిజ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అవార్డును ఈనెల 21న అందుకున్నారు.తన సంపాదనలో కొంతైనా సామాజిక , ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించి గోవాలోని సన్రైజ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రధానం చేసింది.గత 15 ఏళ్లుగా ఆక్వా కార్మికులకు, పేదలకు తన వంతు సాయం చేస్తున్నారు.కోపల్లె గ్రామంలో అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో అంబేద్కర్ జయంతి,వర్ధంతి వేడుకలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు.ఆక్వా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కరోనా మొదటి,రెండు దశల్లో వందలాది మంది కార్మికులకు లక్షల రూపాయలు విలువైన నిత్యావసర సరుకులు అందించారు.కరోనా,లాక్ డౌన్ కారణంగా ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న వందలాదిమంది ఆక్వా కార్మికులు కుటుంబాలకు, పలు గ్రామాల్లో పేదలకు ఆర్థిక సహకారం అందించారు. డాక్టరేట్ అందుకోవడం పట్ల కోపల్లె గ్రామస్తులు నిరీక్షణరాజు ను అభినందిస్తున్నారు.

చంద్రయాన్-3 విజయం మనందరిది-

విశాలాంధ్ర -భీమవరం: చంద్రయాన్-3 విజయాన్ని పురస్కరించుకుని మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు ప్రకాశం చౌక్ లో కేక్ కట్ చేసి చాకోలెట్స్, స్వీట్స్ పంచిపెట్టారు. ఈ సందర్భంగా క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు మాట్లాడుతూ ఇస్రో చైర్మన్ శ్రీ సోమనాథ్ బృందానికి, భారత ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ దేశాల్లోనే భారత్ ప్రత్యేక స్థానం సంపాదించిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సభ్యులు కారుమూరి సత్యరాయణ మూర్తి, ఓలేటి శ్రీను, కోట్ల నాని, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బొండా హనుమంతరావు, కోట్ల ప్రసాద్, జైన్, చవ్వాశ్రీనివాస సుబ్బారావు, సకలా కుమార్, మానేపల్లిరవి చిన్నారావు,తటవర్తిబధరి, జూలూరి రాజా,కంచర్ల భాస్కరావు గుప్తా,కనగర్ల కిషోర్,రామకృష్ణ, పిఆర్కే, గుండు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా పరిషత్ చైర్ ఘంటా పద్మశ్రీ అన్నారు. సత్రంపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్ ను గురువారం జెడ్పీ చైర్ పర్సన్ పర్సన్ ఆకస్మికంగా తనిఖీ చేసి, పాఠశాల తరగతులు, విద్యా బోధన, పారిశుధ్యం, టాయిలెట్ల నిర్వహణ వైద్య సిబ్బంది విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మిన ముఖ్యమంత్రి జగన్ విద్యాభివృద్ధికి విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. విద్యార్థి, విద్యార్థినులకు రక్తహీనత నివారణ మాత్రలను జెడ్పి చైర్ పర్సన్ స్వయంగా వేశారు. అనంతరం పాఠశాలలోని టాయిలెట్ల నిర్వహణ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయి ని శైలజ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ విజేష్, వైసిపి బి సి సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి మహాశక్తి పథకం

విశాలాంధ్ర - నిడదవోలు : టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన 'మహాశక్తి' పథకం మహిళలల ఆర్థికాభివృద్ధికి దోహద మవుతుందని పట్టణ తెలుగుదేశం పార్టీ అద్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా లో మహిళల కోసం టీడీపీ హామీ ఇచ్చిన 'మహాశక్తి' పథకాలపై స్థానిక 28 వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి టీడీపీ మినీ మేనిఫెస్టోలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత నిచ్చారన్నారు. నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిడదవోలు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు నల్లూరి పుష్పవతి,ఎస్కే ఫాతిమా,ఏకలక్ష్మి, ముంతాజ్, పట్టణ టీడీపీ కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ,కౌన్సిలర్ కారంకి నాగేశ్వరరావు, తన్నీడి వీర వెంకట సత్యనారాయణ, బైపే రాజేశ్వరరావు,కేదార్ శెట్టి రవికుమార్, ఎస్కే ఇషాక్, అబ్దుల్ అజీజ్ బాషా,సల్మాన్ రాజు,డి. రామారావు, జి.విజయ్ కుమార్ డి.శ్రీనివాస్, ఎస్కే కరీం,పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అభిమానులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ కావాలి

విశాలాంధ్ర - తాళ్లపూడి : సిపియస్ విధానమును రద్దు చేసి పాత పెన్షన్ విధానము అమలు చేయాలని కోరుతూ వైనాట్ ఓపియస్ పోస్టర్ ను తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆవిష్కరణ చేసినట్లు జిల్లా సిపీయస్ ప్రధాన కార్యదర్శి జోధాల వేంకటేశ్వర రావు అన్నారు. ముఖ్యమంత్రి ఎటువంటి హామీ యిచ్చిన పాత పెన్షన్ మాత్రమే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లక్ష్మి పతి, మండల బాధ్యులు ప్రసన్న కుమార్,రాము,రమణ,రాజు, మునేశ్వరావు, జిల్లా బాధ్యులు శంకర్, రాజ శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మ వారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని జగపతినగరం గ్రామానికి చెందిన అధిక సంఖ్యలో మహిళలు బారీ ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకొని జగపతినగరం గ్రామంతో పాటు కిర్లంపూడి, చిల్లంగి గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగలుత్యాలు, ఆర్కెస్ట్రా, అగోరాలు వంటి పలు సాంస్కృత కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలే గుర్తింపు తెస్తాయి

విశాలాంధ్ర - నిడదవోలు :ఆదర్శ వంతమైన ఉత్తమ సేవలే గుర్తింపుతెస్తామని అందుకు నిడదవోలు ఉప ఖజానాధికారిగా సేవలందిస్తున్న అప్పారావు నిదర్శనమని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు బలగం అప్పారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి ఆంజ నేయులు అన్నారు. 77వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉప ఖజానాధికారిగా అవార్డు పొందిన జి. అప్పారావు ను ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నిడదవోలు శాఖ గురువారం ఖజానా కార్యాలయంలో సన్మానించారు. పలువురు ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్ర మంలో బొజ్జ పాపారావు, పొన్నా కృష్ణ బాబు, పొన్నా సుబ్రహ్మ ణ్యం, దుర్గారావు, ఎస్.ఎం. షరీఫ్, కే.జీ.కే. సామ్రాజ్యం, ఆరుగొల్లు వెంకటేశ్వర్లు, భాస్కరరావు, జి. పాండురంగారావు, దుర్గారావు, రమణ, పెన్షనర్స్ పాల్గొన్నారు.

గ్రామగ్రామాన కాంగ్రెస్ ర్యాలీలు నిర్వహించాలి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ సమావేశం ఇందుపల్లి గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుదుపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ మహ్మద్ ఇస్మాయిల్ ఆరీఫ్ హాజరయ్యారు. ఆరిఫ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం చేయాలని, మండలంలో పార్టీ పునర్నిర్మాణం త్వరలో జరుగుతుందని, గ్రామ గ్రామానికి కాంగ్రెస్ పేరుతో బైక్ ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. పార్టీ బలోపేతానికి మండల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యురాలు అయితాబత్తుల సుభాషిణి, సమన్వయ కమిటీ సభ్యులు అడపా మాచరరావు, రాయుడు రమణ, రాయుడు గంగాభవాని, పులుసుగంటి ప్రకాష్, సత్తి బాపూజీ, కొప్పుల భాస్కర్‌రావు, కుమార్ సింగ్, ఏలేశ్వరపు రాధాకృష్ణ, చోల్లంగి దశరధ, దొమ్మటి రమణ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట ప్రణాళికలు

విశాలాంధ్ర-భీమవరం: రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తుగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టరెట్ కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. కృష్ణవేణి అధ్యక్షతన జిల్లా రహదారులు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ అత్యధిక శాతం జనాభా రోడ్డు ప్రమాదాల్లోనే ప్రాణాలు కోల్పోతున్నారరని అన్నారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరిగిన నేపథ్యంలో రవాణా, అనుబంధ శాఖల అధికారులు రహదారులు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో పలుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలపై పోలీస్, రవాణా, రహదారుల శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదం జరగడానికి కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదికను సమర్పించాలన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత తీసుకునే చర్యలు కంటే ముందస్తుగానే తగిన చర్యలు తీసుకుంటే రహదారుల భద్రత కమిటీ సమావేశం సత్ఫలితాలను ఇస్తుందన్నారు. కాళీపట్నం, ముత్యాలపల్లి గ్రామాలకు అనుకుని ఉన్న జాతీయ రహదారిపై పశువులు తిరగడం వలన పలు ప్రమాదాలు జరుగుతున్నాయని సమావేశం నేషనల్ హైవే అధికారులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై డిఆర్వో స్పందిస్తూ వెంటనే జిల్లా పంచాయతీ అధికారి ద్వారా సంబంధిత పంచాయతీ సర్పంచులకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఈ విషయమై పోలీస్ శాఖ వారు కూడా సంబంధిత గ్రామ ప్రజలతో మాట్లాడాలని సూచించారు. వీరవాసరం, లంకలకోడేరు, భీమవరం బైపాస్, ఉండి, ఉండి నుండి గణపవరం ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవని రవాణా శాఖ పరిశీలనలో గుర్తించడం జరిగిందని ఆర్టీసీ ప్రతినిధి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను డిఆర్ఓ ఆదేశించారు. జిల్లా రవాణా అధికారి టి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో మే నుండి జూలై వరకు 46 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, 47 మంది చనిపోయారని, 164 మంది క్షతగాత్రులు అయినట్టు తెలిపారు. చివరిగా రోడ్డు భద్రత సూచనలపై గోడ ప్రతులను జిల్లా రెవెన్యూ అధికారీ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరరావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్యామల, డీఈవో ఆర్ వెంకటరమణ, డి టి ఆర్ బి ఎస్ఐ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐలు ఫయాజుద్దీన్, సతీష్, ఎంవిఐలు కేఎస్ ప్రసాద్, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, డిఎస్ఎస్ నాయక్, సంజీవ్ కుమార్, ఏ ఏమ్ వి ఐ ఎం. రవికుమార్, డి సి హెచ్ ఎస్, ఎన్ హెచ్ 216, 216- ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం పవన్...పవన్ కోసం మనం

విశాలాంధ్ర - కరప : కరప మండలం గొర్రిపూడి గ్రామంలో జనం కోసం పవన్ కోసం మనం కార్యక్రమాన్ని గ్రామ జనసేన పార్టీ నాయకులు అన్నవరం, యారీష్, రాంబాబు, ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి పిఏసి సభ్యులు పంతం నానాజి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ గొర్రిపూడి గ్రామంలో ఎస్సీ కాలనీకి, అరుంధతీ కాలనీ, మత్స్యకారులు కాలనీలలో ప్రజా సమస్యలు అధికంగా వున్నాయని పంతం నానాజీ తెలిపారు. గ్రామ అభివృద్ధి నిలిచిపోయిందని ప్రజలు చెబుతున్నారని నానాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో భోగి రెడ్డి గంగాధర్, భోగి రెడ్డి కొండబాబు, నాని బాబు, శ్రీను, యాళ్ల పండు, రమేష్, సుబ్బారావు, గాని రాజు, శ్రీనివాస్, కొండ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ విజయంపై హర్షం

విశాలాంధ్ర - నిడదవోలు: చంద్ర యాన్-3 విజయం పై పూలే అంబే డ్కర్ విజ్ఞానకేంద్రం కన్వీనర్ జువ్వల రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. భావితర భవిష్యత్ విద్యార్థులతో. ఇస్రో. భారత శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు రాంబాబు మాట్లాడుతూ జాబిలిపై విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా కాలుమోపిన మహత్తరమైన రోజు దేశంలో శాస్త్రీయ దృక్పథం. హేతుబద్ధతకు లభించిన విజయం అన్నారు. ఆరు దశాబ్దాలుగా నిబద్ధత కఠోర శ్రమ అంకిత భావంతో మన శాస్త్రవేత్తలు చేసిన కృషి ఫలితం అన్నారు. ఈ కార్యక్రమంలో టీ నానీ లెనిన్, సతీష్, లీలా, సరస్వతి కుమార్, రమేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ విజయోత్సవ వేడుక

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి భాష్యం స్కూల్లో చంద్రయాన్ 3 విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. రాకెట్ ఆకృతిలో విద్యార్థులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలోనే చంద్రయాన్ 3 విజయోత్సవం స్థిరంగా ఉంటుందని అన్నారు. ఇస్రో చైర్మన్ శాస్త్రవేత్తలు చేసిన కృషి ఫలించిందని అన్నారు. అగ్రదేశాలు అమెరికా రష్యా చైనా దేశాల సరసన భారతదేశం నిలబడిందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ సత్యనారాయణ చామ్స్ ప్రిన్సిపాల్ శబన ఉపాధ్యాయులు విద్యార్థులు భాష్యం స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రయాన్-3 అపురూప విజయం

విశాలాంధ్ర - అనపర్తి : భారతదేశం వైజ్ఞానిక పరంగా సాంకేతికంగా ఎంత బలంగా ఉందో ప్రపంచ దేశాలకు ఇస్రో చాటి చెప్పిందని ఇది సామాన్య విజయం కాదని అపురూప విజయమని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక దేవి చౌక్ నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి ఆధ్వర్యంలో చంద్రయాన్ -3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్లో కేక్ కట్ చేసి చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటరామారెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగ మండలి అధ్యక్షులు సత్తి దేవదాన రెడ్డి, తేనెల శ్రీను,చిర్ల గంగిరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, భోగి రెడ్డి రాధ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ పార్లమెంట్‌లో అభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర - కాకినాడ : గురువారం ఢిల్లీలో ఓఎన్జిసి సిఎండి అరుణ్ కుమార్ సింగ్ వారిని కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్ మర్యాదపూర్వకముగా కలిసి ఓఎన్‌జిసి నిధులు ద్వారా నిర్మాణ పనులు జరుగతున్న పిఠాపురం ఆర్ఆర్‌బిహెచ్ఆర్ డిగ్రీ కాలేజ్ భవనము నిధులు టెక్నికల్ కారణాల వలన ఆలస్యం అవతున్నయని వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. కాకినాడ రూరల్‌లో 70వ ఎకరాలలో నూతనముగా నిర్మాణము పూర్తి చేసుకున్న ఓఎన్‌జిసి కాంప్లెక్స్ ప్రారంభోత్సవమునకు రావాలని ఆహ్వానించడం జరిగినది. అలాగే కాకినాడ పార్లమెంటు పరిధిలో ఓఎన్‌జిసి కార్యకలాపాల విషయాలు చర్చించి, గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణకు నిధులు మంజూరు చేయాలనీ మరియు వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఇచ్చి వాటికి సహకరించాలని కోరడమైనది. సిఎస్ఆర్ ఈడి సింగ్ ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించి సానుకూలంగా స్పందించారు.